కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్

జగద్గిరిగుట్ట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కార్మికులకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాల్గవ మహాసభలు ఆదివారం గుబురుగుట్టలోని కార్మికుల అడ్డా వద్ద జరిగాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్ రావుతో కలిసి హాజరై ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డులను నిర్వీర్యం చేస్తుందన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను మారుస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులు సంఘటితమై ఈనెల 20న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ గౌడ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగప్ప, పరమేశ్వర్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సాయిలు, నర్సింగరావు, జంగయ్య, మోహన్ రావు, వెంకటరమణ, మునలయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నిఘా నిద్రపోతోంది.!

సర్కిల్ కార్యాలయాల్లో పని చేయని సీసీ కెమెరాలు


ఉప కమిషనర్ చాంబర్‌లో పనిచేయని సీసీ కెమెరా

కుత్బుల్లాపూర్: అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల జంట సర్కిల్ కార్యాలయంలోని సీసీ కెమెరాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. రెండు సంవత్సరాలుగా కెమెరాలు పని చేయడం లేదు. వాటికి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి. ఇక్కడికి వివిధ కాలనీల నుంచి ప్రజలు వచ్చి సిటిజన్ సర్వీస్ సెంటర్లో ఇంటి పన్నులు, పుట్టినరోజు సర్టిఫికెట్ల కోసం వందలాది మంది వస్తుంటారు. ఈ సర్కిల్ పరిధిలో గతంలో 16 సీసీ కెమెరాలు ఉండగా.. అందులో 12 కెమెరాలు పూర్తిగా పాడైపోయాయి. సర్కిల్ కార్యాలయం కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ చాంబర్‌లో 2023 వరకు నాలుగు కెమెరాలు పనిచేశాయి. ఉప కమిషనర్ మంగతాయారు బదిలీపై వెళ్లిన తర్వాత ఆ నాలుగు కెమెరాలు కూడా పని చేయలేదు. అప్పటినుంచి ఇప్పటి వరకు సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయడం మరిచిపోయారు.

ఇష్టానుసారంగా విధులకు..

జంట సర్కిల్ కార్యాలయంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు ఇష్టం వచ్చినట్లు వచ్చి పోతున్నారు. గతంలో సీసీ కెమెరా ఉప కమిషనర్ చాంబర్‌లో ఉండగా.. అన్ని విభాగాల్లో కెమెరాలు అనుసంధానం చేసి వారి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించేవారు. రెవెన్యూ, శానిటేషన్, అడ్మిన్, యూసీడీ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ఎంటమాలజీ అధికారుల చాంబర్లలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఆ అధికారులు ఎప్పుడు వస్తున్నారు..ఎప్పుడు పోతున్నారు.. అన్న విషయమే తెలియడం లేదు.



టెండర్ కాగానే కెమెరాల ఏర్పాటు

ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాల మరమ్మతులతో పాటు మరో 16 సీసీ కెమెరాల ఏర్పాటుపై టెండర్లను ఆహ్వానించాం. ఎవరూ ముందుకు రాలేదు. మరొకసారి ప్రణాళికలు రూపొందించి అధికారులకు నివేదిక పంపిస్తాం. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

– లక్ష్మీ గణేష్,
కుత్బుల్లాపూర్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



నిజాంపేట్ : 11కేవీ ప్రశాంత్ నగర్ ఫీడర్‌లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 2 గంటల వరకు మయూరి నగర్, టెంపుల్ కాంప్లెక్స్, ఆర్ఎల్‌సిటీ రోడ్డు, వృద్ధాశ్రమం, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

అలీప్ సబ్ సబ్‌స్టేషన్ పరిధిలో...

33/11కేవీ అలీప్ సబ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ డాక్టర్ కాలనీ ఓహెచ్ ఫీడర్, 11కేవీ మధురానగర్ ఫీడర్, 11కేవీ ఆర్‌జీకే ఫీడర్‌లలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఉదయం 11 నుంచి 3 గంటల వరకు శిల్పా లే అవుట్ ఏరియా, డాలర్ హోమ్స్, కెనరా బ్యాంక్ ఏరియా, మోర్ సూపర్ మార్కెట్, అంబా భవాని హోటల్ ఏరియా, పాలిమెరాస్, సురక్ష హాస్పిటల్, వాసవి లే అవుట్, సాయిలక్ష్మి లే అవుట్, న్యూ విజేత సూపర్ మార్కెట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పేట్‌బషీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. వైష్ణవి ఎన్‌క్లేవ్, వనమ్స్ స్క్వేర్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్, హర్ష ఆసుపత్రి ఏరియా, డి మార్ట్ వెనుక భాగం, జేజీబాబు లైన్ ఏరియా ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


సమస్యలు తెలుసుకుంటున్న భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారులు పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధి వుడ్స్ ఎన్‌క్లేవ్, వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో రోడ్లు, శానిటేషన్, డ్రైనేజీ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని కాలనీ వాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆదివారం కాలనీ వాసులతో కలిసి కాలనీల్లో పర్యటించారు. కార్యక్రమంలో తోట భిక్షపతి, నర్సింహారెడ్డి, శ్రీహరి రెడ్డి, నాగరాజు, శివకుమార్, రవీందర్ గౌడ్, శ్రీశైలం, విష్ణువర్ధన్, ఉదయ్ కుమార్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ లేక పరేషాన్

రద్దీగా మీసేవ, రైతు బజారు

జగద్గిరిగుట్ట: షాపూర్ నగర్ మీసేవా కేంద్రానికి వెళ్లే వినియోగదారులకు పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. రైతు బజారులో మీ సేవా కేంద్రం ఉండడం.. అటు మార్కెట్‌కు వచ్చే కొనుగోలుదారులు, ఇటు మీసేవా కేంద్రానికి వచ్చే వినియోగదారులతో ఎప్పుడూ కిటకిటలాడుతుంది. నిత్యం నర్సాపూర్ నుంచి ఈ రైతు బజారుకు కూరగాయలు వస్తాయి. వాటిని ఇక్కడి నుంచి ఆటోలలో వివిధ మార్కెట్లకు చేరవేస్తారు. ఈ క్రమంలో ఆటోల వల్ల కూడా మీసేవా కేంద్రానికి వచ్చే వినియోగదారులకు పార్కింగ్ సమస్యలు ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.


మీసేవా ముందు ఇలా..

ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్‌ను ఆదివారం ప్రారంభించారు. హెల్ప్ డెస్క్‌లో ఉన్న పట్టణ ప్రణాళిక అధికారులు ఎల్ఆర్ఎస్ విషయంలో ప్రజలకు ఉన్న సందేహాలను తీరుస్తామని అధికారులు తెలిపారు. ఎల్ఆర్ఎస్ పెండింగ్‌లో ఉన్న ప్లాట్ల యజమానులందరూ ఎల్ఆర్ఎస్ ఛార్జీలను మార్చి 31లోగా చెల్లించి 25 శాతం రాయితీ పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అనుమతులు లేని లే అవుట్లను రెగ్యులర్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

బస్ డిపో నిర్మించాలని నిరసన



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టలో బస్ డిపో నిర్మించాలని బస్ డిపో సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..జగద్గిరిగుట్ట ప్రాంతంలో పాత బస్ డిపో స్థితిగతులు దయనీయంగా ఉన్నాయన్నారు. బస్సులను పార్కింగ్ చేసేందుకు తగినంత స్థలం లేకపోవడంతో పాటు రాత్రిపూట వివిధ జిల్లాల నుంచి వచ్చే సుమారు 40 బస్సులకు పార్కింగ్ కష్టతరంగా మారిందన్నారు. హెచ్ఎంటీ స్థలంలో కొత్త బస్ డిపో నిర్మించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆకుల సతీష్, జయశంకర్ గౌడ్, ఆంజనేయులు, అమలేశ్వరి, శ్రీనివాస్ గౌడ్, అరుణ్ రావు, సుభాష్, విశాల్, సంతోష్, శివ గౌడ్, ఈశ్వర్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు ఆర్థికసాయం



నిజాంపేట్ : బాచుపల్లి సాయినగర్‌లోని బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఎండీ సలీంకు ఎమ్మెల్యే అందజేసిన రూ.25 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం కార్యకర్తలు అందజేశారు. పాషా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎస్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, నాయకులు జహంగీర్, బొబ్బా శ్రీను, మేడ రామ నరసయ్య, జలగం చంద్రయ్య, బాబు మియా కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆదర్శంగా ఉండాలి


సమావేశంలో జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నేటి తరానికి సీనియర్ సిటిజన్స్ మార్గదర్శకులుగా ఉంటూ మంచి చెడులను వివరించాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ వేంకటేశ్వర కాలనీ వెస్ట్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కుంట సిద్దిరాములు, సుధాకర్ గౌడ్, ఎల్లా గౌడ్, జ్ఞానేశ్వర్, విజయ్ హరీష్, సీనియర్ సిటిజన్ సభ్యులు సమ్మయ్య, శంకరయ్య, రాంచందర్, రాజ్‌కుమార్, ఆంజనేయులు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

'ఆపరేషన్ కగార్ అప్రజాస్వామికం'

జవహర్‌నగర్: ఆపరేషన్ కగార్ అప్రజాస్వామికమని, కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడనాడి వెంటనే కేంద్ర బలగాలను అడవుల్లో నుంచి వెనక్కి పంపించాలని లేదంటే ప్రజాగ్రహం తప్పదని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఆదివారం జవహర్‌నగర్ అంబేడ్కర్ ప్రధాన చౌరస్తాలో పీవోడబ్ల్యూ (విముక్తి) రాష్ట్ర నాయకురాలు సునీత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక విధానాలతో చట్టబద్ధ రాజ్యాంగ వ్యవస్థలను నీరుగారుస్తోందని ఆరోపించారు. ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలీ, నాయకులు కొన్నె వేణు, రషీద్, సింగరాయగౌడ్, యాకస్వామి, చంద్రన్న, ప్రసాద్, రాంరెడ్డి, యాదగిరి, విజయ్, శంకర్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ల ఆవరణలో పరిశుభ్రత పాటించాలి

- వాటర్ వర్క్స్ ఈడీ మయాంక్ మిట్టల్
- షెడ్యూల్‌లో లేని రిజర్వాయర్‌ను కూడా పరిశీలన
- నివ్వెరపోయిన అధికారులు


జీడిమెట్లలోని రిజర్వాయర్ వద్ద ఫిల్లింగ్ పాయింట్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఈడీ

చింతల్: రిజర్వాయర్ల ఆవరణలో పరిశుభ్రత పాటించాలని వాటర్ వర్క్స్ ఈడీ మయాంక్ మిట్టల్ అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్‌లోని పలు రిజర్వాయర్లను తనిఖీ చేశారు. అదేవిధంగా రిజర్వాయర్ల ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను పరిశీలించారు. మొదటగా షాపూర్ నగర్ రిజర్వాయర్ వద్ద ఒకటే పాయింట్ ఉండటంతో నీటి కటకట పై సాక్షిలో వచ్చిన కథనాలపై జలమండలి అధికారులు స్పందించారు. దీంతో షాపూర్ నగర్ రిజర్వాయర్ ఆవరణలో మరో ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్‌ను మంజూరు చేయడంతో ఆదివారం ఈడీ ఫిల్లింగ్ విధానాన్ని ప్రారంభించారు.

అపరిశుభ్రతపై నిలదీసిన ఈడీ

షాపూర్ నగర్ నుంచి నేరుగా వసంత కెమికల్స్ వద్ద ఉన్న మరో రిజర్వాయర్ నుంచి ఈడీ సర్కిల్-4 సీజీఎం నారాయణ, కుత్బుల్లాపూర్ జీఎం అశోక్‌లతో సందర్శించారు. షెడ్యూల్‌లో లేనప్పటికీ ఈడీ అక్కడికి వెళ్దామని చెప్పడంతో అధికారులు నివ్వెరపోయారు. జీడిమెట్ల ఫిల్లింగ్ పాయింట్ వద్ద ఉన్న అపరిశుభ్రతపై అధికారులను నిలదీశారు. అవసరం ఉంటేనే నూతన ఫిల్లింగ్ పాయింట్‌ను ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో నూతన పాయింట్ల మంజూరును నిలిపివేయాలని సూచించారు. ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద నీటి లీకేజీపై ప్రశ్నించారు. షాపూర్ నగర్ ఫిల్లింగ్ పాయింట్ల వద్ద ఫిల్లింగ్ విధానాన్ని చూసుకునే సిబ్బంది ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. చలికాలంలో వణుకుతూ ఇబ్బంది పడుతున్నారు. అక్కడకు వచ్చింది ఈడీ అని తెలియక వారు సమస్యలను నివేదించారు. షెడ్డు లేక దోమలతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇక్కడ చిన్న గదిని నిర్మించాలని ఈడీ ఆదేశించారు. ఎలక్ట్రికల్ డీజీఎం అప్పలనాయుడు, మేనేజర్లు సదరు ఫిల్లింగ్ స్టేషన్ ఇన్‌చార్జిపై 'షటప్.. యూస్ లెస్ ఫెలో.. ఎవరికి ఏ విషయం చెప్పాలో తెలియదు నీకు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీజీఎంలు రవి, రాజేష్, మేనేజర్లు రోహిణి, రమ్య భారతి, ఎలక్ట్రికల్ మేనేజర్ అమర్‌నాథ్ పాల్గొన్నారు.

యువకుడి మృతి

కుత్బుల్లాపూర్: వెక్కిళ్లు వచ్చిన యువకుడు అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. దేవరయాంజాల్ మల్లన్న కాలనీకి చెందిన ప్రశాంత త్రిపుర(23) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో అతనికి వెక్కిళ్లు వచ్చాయి. వెంటనే అతని సోదరుడు నీళ్లు తాగించేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. వెంటనే కండ్లకోయలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిర్లక్ష్యం వీడాలి.. సంరక్షణ పెరగాలి

గత, ప్రస్తుత ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం, వనమహోత్సవం లక్ష్యం కొరవడింది. పర్యవేక్షణ కరువై, నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది. మొక్కల సంరక్షణపై పాలకులకు శ్రద్ధ లేకపోవటంతో పనులు ముందుకు సాగడం లేదు. పురపాలక సంఘాలు, పంచాయతీల్లో నర్సరీలను పెంచే బాధ్యతను ప్రస్తుతం డీఆర్డీఏ చూస్తోంది.

– సాక్షి,సిటీబ్యూరో

- హరితహారం, వనమహోత్సవం మొక్కల పెంపకంపై దృష్టి
- ప్రస్తుతం పట్టించుకోకపోవడంతో ఎండుతున్న మొక్కలు
- దయనీయంగా పల్లె, పట్టణ ప్రకృతి వనాలు
- ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలంటున్న ప్రజలు



మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో హరితహారం, వనమహోత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 5.50 కోట్ల మొక్కలు నాటారు. అధికారిక లెక్కల్లో జియో ట్యాగింగ్ రూపంలో వాటి లెక్కలు కనపడుతున్నాయే తప్పా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా కనబడుతోంది.

నిలువెల్లా నిర్లక్ష్యం

జిల్లాలో కొన్ని పంచాయతీలు, పురపాలక సంఘాలు మాత్రమే మొక్కల సంరక్షణపై శ్రద్ధ చూపుతుండగా, మరి కొన్ని చోట్ల పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో చేస్తున్న పర్యవేక్షణ.. సంరక్షణ చర్యల్లో ఏమాత్రం కనిపించడం లేదనే విమర్శలున్నాయి. నర్సరీల నిర్వహణకు రూ. లక్షల్లో ఖర్చు చేసి మొక్కలు పెంచి, వాటిని సంరక్షించకుండా గాలికి వదిలేయడంతో ప్రజాధనం వృథా అవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొక్కల పెంపకానికి రోజూవారీ చెల్లింపులు

ఒక్కో నర్సరీలో మొక్కల పెంపకానికి కూలీకి రూ. 257లు రోజువారీగా చెల్లిస్తున్నారు. మట్టిని కవర్లలో నింపి విత్తనాలు విత్తేందుకు దాదాపు రూ. 1.20 వెచ్చిస్తున్నారు. ఒక్కో మొక్క నాటేందుకు, పాదులు తీసేందుకు రూ.37 వరకు ఖర్చు చేస్తున్నారు. రక్షణ కంచెకు రూ. 6, నీరు పోసేందుకు రూ.3 కేటాయిస్తున్నారు. ఇంత వ్యయం చేసి మొక్కను బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి.

పనులకు ఆటంకాలు

పంచాయతీ, పట్టణాలకు వచ్చే పల్లె, పట్టణ ప్రగతి నిధులు, ఇతర గ్రాంట్స్ 10 శాతం వరకు హరితహారం, వనమహోత్సవాలకు వెచ్చిస్తున్నారు. ఇటు మొక్కలు బతకపోగా అటు పంచాయతీలు, పురపాలికల్లోని నిధుల్లో నుంచి 10 శాతం కోతతో ఇతర అభివృద్ధి పనులకు ఆటంకాలు తప్పడం లేదు.

214 ఎకరాల్లో 102 పల్లె వనాలు

నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలోని 214 ఎకరాల్లో 102 పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఏర్పాటు చేశారు.

ఎకరానికి 2,500 మొక్కలు

ఉపాధి హామీ పథకం కింద నిధులు వెచ్చించి ఎకరానికి 2,500 మొక్కల చొప్పున నాటడం వల్ల చిన్న వృక్షాలుగా అభివృద్ధి చెందాయి. పల్లెలతో పాటు నగర వాసులకు పల్లె,పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుండగా... నిర్వహణలో తలెత్తిన లోపం, నిర్లక్ష్యం కారణంగా పల్లె,పట్టణ ప్రకృతి వనాలు పచ్చదనాన్ని కోల్పేయే పరిస్థితికి చేరుకున్నాయి.

ఎండిపోతున్న మొక్కలు

పర్యవేక్షణలో కొరవడిన అలసత్వం కారణంగా ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. జిల్లాలో మండలాల వారీగా పల్లె,పట్టణ ప్రకృతి వనాలు ఈ విధంగా ఉన్నాయి.

◆ 13 పురపాలక సంఘాల్లో 21 పట్టణ ప్రకృతి వనాలు ఉండగా.. పార్కుల నిర్వహణ బాధ్యతలను సంబంధిత పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలతో సహా జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖలు, జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) నిరంతరంగా పర్యవేక్షించాల్సి ఉండగా.. ప్రత్యేక శ్రద్ధ కనబరచడం లేదని విమర్శలున్నాయి.

సంపద వనాలు పరిస్థితి అంతే...

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 5 మండలాల పరిధిలో 8 నుంచి పదెకరాల లోపు ప్రభుత్వ భూముల్లో వెలసిన సంపద వనాల నిర్వహణ కూడా మొక్కుబడిగానే కొనసాగుతోంది. వీటిని కూడా పట్టించుకునేవారే లేకపోవడంతో ఎండలకు వాడిపోతున్నాయి. పచ్చదనానికి తోడుగా పండ్లు ,కలప ,సుగంధ ద్రవ్యాలను ఇచ్చే టేకు, గంధం, నీలగిరి, ఉసిరి, జామ, మామిడి తదితర మొక్కలు పెంపకం ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు కాచవాని సింగారం, బొమ్మరాసిపేట్, శ్రీరంగవరం, జగన్‌గూడ, చీర్యాలలో సంపదవనాలను పెంచుతున్నారు.

పర్యవేక్షణ లోపం...

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో గ్రామాలు, పట్టణాల మధ్య రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కల సంరక్షణలో కూడా పర్యవేక్షణ లోపం కనిపిస్తోంది. శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో మొక్కలకు నీరు అందడం లేదు. దీంతో గ్రామాలు, పట్టణాల మధ్య ఉన్న రహదారులు, రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి.

◆ మేడ్చల్, ఘట్కేసర్, దుండిగల్, బోడుప్పల్, నిజాంపేట్, గుండ్లపోచంపల్లి, నాగారం, తూముకుంట, కొంపెల్లి పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో కూడా మొక్కలు వాడిపోతున్నాయి.

◆ జిల్లాలో 30 నుంచి 40 శాతం మొక్కలు ఎండిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రజలు ఎన్నుకున్న పాలక వర్గాల గడువు ముగియడంతో గత కొంతకాలంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..

ప్రత్యేక అధికారులు మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవటంతో సిబ్బంది వాటిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగంతో సహా డీఆర్డీఏ, అటవీ, పంచాయతీశాఖలు, పురపాలక సంఘాలు, సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఎండుతున్న మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.


సూరారం వెంకట్రాంనగర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం జరిగిన వార్షిక కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు. – కుత్బుల్లాపూర్

నివాసాల మధ్య కాలుష్య పరిశ్రమలు!

ఇబ్బంది పడుతున్న వెంకటాద్రినగర్ వాసులు

జీడిమెట్ల: నివాసాల మధ్య పరిశ్రమల వల్ల కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆ పొగతో శ్వాసకోస వ్యాధులు వస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1987లో మొదటగా ప్రాగాటూల్స్ వెంచర్‌గా ఏర్పడిన రెసిడెన్షియల్ జోన్ 2017లో వెంకటాద్రినగర్‌గా రూపుదిద్దుకుంది. 540 ప్లాట్లు ఉండగా.. కాలనీలో దాదాపు 500పై చిలుకు కుటుంబాలు కాలనీలో నివసిస్తున్నాయి. దాదాపు 10 సంవత్సరాల క్రితం నుంచి వెంకటాద్రినగర్‌కు కాలుష్యాన్ని వెదజల్లే వివిధ పరిశ్రమలు వచ్చాయి. అప్పటి నుంచి కాలనీలో రాత్రిపూట విపరీతమైన రసాయనాల దుర్వాసన వస్తుందని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొన్ని ఫుడ్ ఇండస్ట్రీస్ నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా హానికర వాయువులు వెలువడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై నా అధికారులు కాలనీలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వెలువడుతున్న పొగ

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



కాలనీలో ఉన్న స్క్రాప్ గోదాములతో పాటు డ్రమ్ముల రీసైక్లింగ్ పరిశ్రమల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశాం. వారు నోటీసులు జారీ చేసి వెళ్లిపోయారు. అనంతరం చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా అధికారులు కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి.

– లక్ష్మి, వెంకటాద్రినగర్ కాలనీ అధ్యక్షురాలు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఆల్విన్‌కాలనీ: కూచిపూడి నృత్య కళా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆదివారం అవార్డులను అందజేశారు. బిర్లా భాస్కర ఆడిటోరియంలో కళాకర్ తెలుగు టీవీ, శివనంది అవార్డ్స్-2025 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు దైవజ్ఞ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నృత్య పోటీల్లో హైదర్‌నగర్‌లోని రుహాని కూచిపూడి నృత్య అకాడమీ నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో బిందు మాధవి, భావనలతో పాటు పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు దైవజ్ఞ శర్మ అవార్డులు ప్రదానం చేశారు.